# పులిని చూసి....

రచన :
శ్రీ బోగరాజు పేరాజు.

మావీథికి రెండు వీధుల అవతల మా పిన్నివాళ్ళ ఇల్లు ఉంది, ఆవిడ ప్రఖ్యాత రచయిత్రి. ఆమె రచనా వైశిష్ట్యాన్ని తెగపొగుడుతూ అనుదినమూ అంతులేని ప్రశంసలు వస్తూంటాయి. ఒకనాడు నేను ఆమె ఇంటికి వెళ్లేసరికి, తన అభిమాన పాఠకులనుండి వచ్చిన లేఖలు చదువుతూంది. ఆనందంతో, ఆసక్తిగా, అభిమానుల ఉత్తరాలను చదువుకొంటూన్న మా పిన్నిని చూస్తూ కొంతసేపు కూర్చున్నా.

ఆ తరువాత అంతులేనిఆలోచనలతో ఇంటికి బయలుదేరా. దారిలో నా ఆలోచన అంతా మా పిన్నిఖ్యాతి గురించే. ఆమె అఖిలాంధ్రులచే అనవరతమూ అభిమానింపబడే ప్రఖ్యాత రచయిత్రి. ఇంగ్లీషు, తెలుగు, హిందీ భాషలలో చక్కని పాండిత్యం కలిగి, నవరసాలనూ తన రచనలలో మేళవించి, ఇప్పుడిప్పుడే భారతదేశ మందంతటా తన కీర్తి కాంతులను ప్రసరింప జేసు కుంటోంది ఆమె. ఆమెను తలచుకున్నప్పుడల్లా నాకేమిటో అదోవిధంగా ఉంటుంది. నేను కూడా ఆమె అంత గొప్పవాడిని కాలేకపోయినా కనీసం చిన్నచిన్న కథలైనా వ్రాసి, ఓ చిన్న రచయితగా ఆంధ్రులచే గుర్తింపబడితే బాగుండునని ఓ, వెధవ ఆశాపిశాచం నాలో ఆవహించింది.

ఇంటికి వెళ్ళి దీర్ఘంగా ఆలోచించా. అన్నం తిని కళ్ళు మూసుకొని పడుకున్నానన్నమాటేగానీ మా పిన్నికి వచ్చిన ఫేన్ మెయిల్ (అభిమాన పాఠకుల ఉత్తరాలు) నా కళ్ళముందు వెక్కిరిస్తూన్నట్లు తిరగసాగాయి......

× × ×

చక్కని ప్రశాంత సమయం. ముద్దుల మూటగట్టే ఒక చక్కని డాబాలోని వరండాలో డన్‌లప్ కుషన్ కుర్చీలో కూర్చున్నాను. క్రొత్తగాకొన్న ఉషాఫేను గాలి, మలయ మారుతానికి తోడై వీస్తోంది. 'సీడ' అనే టేక్‌వుడ్ టేబిల్‌పై, అందమైన టేబుల్‌లైటు పెట్టుకొన్నాను. క్రోటన్సు కుండీ మొక్కల నడుమ, పిట్టగోడపై, చంద్రుని వెన్నెల వలన వచ్చిన వింత సోయగంతో, వయ్యారంగా కూర్చొనియున్న నా ప్రేయసిని అవలోకిస్తు, 'షెఫర్' పెన్నుతో వ్రాసి పడేశాను. తర్వాత ఆ శృంగారకాండ పత్రికలలో సీరియల్స్‌గా ప్రచురింప సాగారు. ఆ కథలోని సస్పెన్సుకు తట్టుకోలేని పాఠకులు మా యింటి మీదకువచ్చి, ఇవాళ ఆ, కథ చివరికి ఏమవుతుందో చెప్తావా, సరి, లేకుంటే ఆ, సస్పెన్సుకు గుండె పగిలి చచ్చామంటే, పోలీసులు నిన్ను జైలులో పడేస్తారు!'' అని అన్నారు. అప్పుడు నా బుర్ర అమోఘంగా పనిచేసింది సుమండీ! పోలీస్ వాళ్ళ మాట వినగానే వాళ్ళకు ఫోన్ చేసాను. వాళ్ళు వచ్చి ఆ, అత్యవసర పరిస్థితిని అదుపులోనికి తెచ్చారు.

'అమ్మ బాబోయ్. అయితే అంత ఎక్కువ సస్పెన్సు పెట్టడం కూడా మంచిది కాదన్నమాట. సస్పెన్సు ఉండేలా వ్రాయకపోతే పత్రికలవారు ఊరుకోరే. ఎల్లాగురా భగవంతుడా! అని అనుకొన్నాను. చివరకు ఆ కథ పూర్తి అయి, పుస్తకంగా వెలువడి, అఖిలాంధ్రులూ చదివి అవతల పడేశారు. ఒకనాడు రాష్ట్రరాజధానిలో జరిగిన సన్మాన సభలో ముఖ్యమంత్రిగారు, నా రచనా నైపుణ్యాన్ని గూర్చి ప్రశంసిస్తు, నా రచనా వైశిష్ట్యాన్ని గూర్చి భారత చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించాలన్నారు. ఆ మర్నాడు పత్రికలలోనూ, రేడియోలలోనూ నా గురించి ప్రశంసలే. నేను రాష్ట్ర రాజధానీ నగరం నుండి మా ఊరు తిరుగు ప్రయాణమై విమనాశ్రయానికి వచ్చేసరికి నన్ను చూడటానికి వచ్చిన పాఠకాభిమానులను చూడగానే నా గుండె కొట్టుకోవడం ఇంచుమించు కాసేపు ఆగిపోయి మళ్ళీ స్లోమోషన్‌లో కొట్టుకోవడం ఆరంభించి, జనులందరూ నాకు జయజయ ధ్వనులు పలకడంతో, తారాస్థాయిని అందుకొంది. నా అభిమాన పాఠకులందరికీ 'హీరియో!' 'హీరియో!' అని చేతులు ఊపుతున్నాను—

మా అమ్మ చన్నీళ్లు నా మొహంపై జల్లి పైత్యంచిందేమిట్రా? 'హీరియో!' 'హీరియో!' అని అరుస్తు, చేతులూపుతున్నావు నిద్రలో'' అని అడిగింది.

చివరికలాగైతే నేం మా ఇంట్లోని కాగితాలన్నిటినీ మా చెల్లెలి నోట్సులతో సహా ఖరాబుచేసి, చిన్న కథ వ్రాసి, చిన్న సర్క్యులేషన్‌గల పత్రికకు పంపాను.

ఎందుకనంటే పెద్ద సర్క్యులేషన్ గల పత్రికలు, నా వంటి రచయితల కథలను ప్రచురించడానికి సాహసించలేరు. అథవా ఒకవేళ చూసో, చూడకో ప్రచురిస్తే... మళ్ళీ మా పిన్నిలాంటి ప్రసిద్ధ రచయితలు పదిమంది కలసినా, ఆ పత్రికకు పూర్వపు సర్క్యులేషన్ వచ్చేలా చేయలేరు. కనుక ఈ బాధలన్నీ వాళ్ళకెందుకని, ఒక చిన్న సర్క్యులేషన్ గల పత్రికకే పంపించాను. కొన్ని నెలలు పోయినతర్వాత బుక్ పోస్టులో నాకొక పుస్తకం వచ్చింది. ఆశ్చర్యం. అందులో నా కథ కూడా ప్రచురింపబడింది. నా ఆనందానికి మేర లేదు. ఆ పుస్తకంలో ప్రచురింపబడ్డ నా పేరును పదేపదే చూసుకొని మురిసిపోయాను. పరుగెత్తుకొని వెళ్ళి మా పిన్నికి చూపించాను. ఆమె నా అంతులేని ఆనందాన్ని గమనించి చిరునవ్వు నవ్వి పంపించేముందే నాకొకమారు చూపించలేకపోయావా బాబూ.' అని, 'అయినా ఫర్వాలేదు, ఇలాగే వ్రాస్తుండు. వ్రాసి, పంపించేముందు మాత్రం నాకు చూపించు. నేను సవరించి వ్రాసిఇస్తాను' అని అంది.

ఆ కథ పడిన కొన్ని రోజులకు పాఠకుల నుండి ఉత్తరాలు కట్టలు కట్టలుగా వచ్చిపడ్డాయి. అమ్మ! అమ్మ చెబితే నమ్మరు. తెలుగు భాషనంతా ఉపయోగించి ఎంతవరకూ వాళ్ళకి చేతనవునో అంతవరకూ తిట్టిపోసారు.

ఒక రోజున పత్రిక ప్రచురణ కర్తలనుండి ఒక లేఖ వచ్చింది. నేను పంపిన రెండో కథ అందినట్లు, త్వరలో ప్రచురిస్తామని తెలియజేయడానికి ఎంతో సంతోషిస్తున్నామని వ్రాశాడేమోనని ఎంచి, చదువ నారంభించా. "బాబూ! నీ రెండవ కథను ఈ లేఖతోపాటు తిరిగి నీకే పంపివేస్తున్నాను. నీ మొదటికథ ప్రచురించినందుకే విమర్శలు రాళ్ళలా ఇంకా వచ్చి పడుతూనే ఉన్నాయి, ఆ విమర్శలు కొన్ని చదివిన మా ఎడిటర్ గారు తాత్కాలికంగా ఉద్యోగం నుండి విరమించి ఊరు వదలి వెళ్ళిపోయారు. నీ రచనలకూ-నీకూ ఒక నమస్కారం."

ఆ ఉత్తరం చదవడంతోనే నాకు మూర్ఛ వచ్చినంత పనయ్యింది.

ఆ రోజు మా ఇంట్లోని వారందరూ ఏదో సినిమాకు రెండవ ఆటకు వెళ్ళారు. రాత్రి స్టవ్ పై పాలు వెచ్చబెట్టి ఆ స్టవ్ ను వరండాలోనే విడిచి పెట్టాను. సగం నిద్రలో మెలుకువ వచ్చింది. టయిము చూస్తే 12 గంటలు అయ్యింది. 'అయ్యబాబోయ్ దెయ్యాలు తిరిగే వేళ' అని అనుకొన్నా. దాహంతో ప్రాణాలు పోయేటట్లున్నాయి. మంచినీళ్ళ కూజా కూడా వరండాలోనే ఉంది. బిక్కు బిక్కుమంటూ వరండాలోనికి వచ్చాను. బయట దొడ్లో పుచ్చపువ్వులాంటి వెన్నెల. స్టవ్ పెట్టిన చోట లేదు సరికదా ఆ స్థానంలో అందమైన ఒక అమ్మాయి ఉంది. (స్టవ్ పై కూర్చుంది కాబోలు) ఆమె శరీరంలోని అవయవాలన్నీ తీర్చిదిద్దినట్లు, చూస్తే మళ్ళీ మళ్ళీ చూడాలనేటట్లు ఉన్నాయి. ఆమె అందం వర్ణిస్తూ శృంగార నైషధం వంటి ఒక ఉద్గ్రంథాన్ని వ్రాసి పడేయవచ్చు, పత్రికలోపడ్డ నా కథ చదివి దుఃఖం ఆపుకోలేక వచ్చిన నా అభిమాన పాఠకురాలేమోనని అనుకొని 'ఎవరండీ మీరు' అని అన్నాను.

అంతే...........

ఒక్కమాటు లేచి నిలబడింది. ఇంకా ఎదిగిపోను. మా ఇంటి పైకప్పు అంతే ఉండడం మూలాన అంతలో ఆగిపోయింది. నన్ను తన గుప్పిట్లోనికి తీసుకొని, ఆ చేతి బొటనవ్రేలితోనే సరదాగా నా కంఠం ముడి నొక్కుతూ వదలుతూ......(నా కంటే ప్రాణసంకట పరిస్థితి గానీ, దానికి చెలగాటమేగా)

"నీ కథలో పాఠకుల అభిమానం కోసం వాస్తవికత, వాస్తవికత అంటూ, నన్ను క్రూరంగా చిత్రించి దుర్మరణం పాలొనరించావు. ఆ కథా నాయికనిరా" అంది.

"అయితే....అమ్మ....బాబోయ్....దె....దె..." అన్నాను వణుకుతూ.

'అవునురా దెయ్యాన్నే! అంది.

అప్పుడే నా పంచప్రాణాల్లో ఇంచుమించు నాలుగు ప్రాణాలు నా పని అయిపోయిందనుకొని నాలుగు ప్రాణాలు నాలుగు కుక్కపిల్లల్లాగ, హుషారుగా పరుగెత్తి పారిపోబోతూంటే...'ఉండండ్రో ఇంకా నేను చచ్చినట్లు ధృవపడలేదు. మీరింతకాలం నా బొందిలో ఉంటూ, నేడు విశ్వాసహీనులై, నిజంగా చావకుండానే పోతారా కృతఘ్నుల్లారా' అన్నాను. అవి మొహం మాడ్చుకొని సరే ఘడియలోనో అరఘడియలోనో ఏదెల్లాగూ పోతాడు కదా వదల ప్రాణాన్ని ఒక్కదాన్నీ

వదలిపెయ్యడ మెందుకు? ఏకంగా అందరం కలిసే కబుర్లు చెప్పుకొంటూ పోవచ్చు ననుకొన్నాయి. అప్పుడు నా ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని ఆ దెయ్యంతో 'చూడు దెయ్యం...' అన్నాను.

'ఆయ్. మంచే మర్యాదా తెలియదురా' అంది పిడుగులు పడేలా గర్జిస్తూ. నా కర్ణపుటాలదిరిగి పోయాయి.

'చూడండి దెయ్యంగారూ, రేపే నేను ఆ కథను మరోవిధంగా మార్చి, కథానాయకుడిని దుర్మార్గునిగా, దుష్టునిగా చిత్రించి మిమ్ములను శరత్ శైలిలో-కాదు.. కాదు...అంతకన్నా వెయ్యింతలు గొప్పగా చిత్రిస్తానన్నాను. అప్పుడావిడ ఊగిపోతూ, ఆ ఊపుకి నాకళ్లు తిరిగిపోయాయి. కానీ ఆవిడ అరుస్తోందిగా ఆ అరుపు మాత్రం వినబడుతోంది. 'బాగుందిరా కానీ అసలు నీ కథను ప్రచురించే దెవ్వరూ' అంది సందేహంగా. అదీ నిజమే ఒక్కొక్కరి జాతకఫలం మా వూళ్ళో ఒక సినిమాహాలు కట్టేటప్పుడు శంఖుస్థాపన జరిగిన రోజున, కొబ్బరికాయ కొడుతూనే కొట్టినవాడు చచ్చాడు.

హాలు కట్టడం అవబోతుందనగా కట్టించిన కాంట్రాక్టరుకు కాలం చెల్లిపోయింది. కాలం మాడిన ఒక వ్యక్తి ప్రారంభోత్సవానికి వచ్చి, రిబ్బన్ కత్తిరించబోయి తన వ్రేలినే కత్తిరించుకొని, ధనుర్వాతం వచ్చి కొన్ని గంటలలో గతించాడు. ఇప్పుడాహాలు దరిదాపులకు పగలుకానీ రాత్రికానీ లక్షలకొలదీ రూపాయలిస్తామన్నా కొబ్బరికాయ కొట్టినవాడు, కంట్రాక్టరు, ప్రారంభోత్సవం చేసినవాడు—ముగ్గురూ యమలోకం నుండీ రిలీజయిన సినీమాలు చూసుకొంటూ ఆనందిస్తూంటారని ప్రతీతి.

నా జాతకంకూడా అలాటి నష్టజాతకమే. లేకపోతే పంపక పంపక నేను కథ పంపడమేమిటీ? పత్రికలో కథ ప్రచురించిన తక్షణం ఎడిటరు ఉద్యోగం వదలుకొని ఇంటికి పోవడమేమిటీ? ఈ మాటు నా వ్రాయబోయే కథ ఎవరికి పంపనా అని ఆలోచిస్తూన్నాను. ఏదో విధంగా ఆ పత్రికకే పంపుదామనుకొంటే కిందటి కథకు ఎడిటర్ ఉద్యోగం, ఊరు, వదలి పారిపోయాడు. ఇక రెండవ కథ కూడా పంపితే...ఇంకేమన్నా ఉందా...ఏం దారిరా భగవంతుడా అని అనుకొంటూన్న నాకు ఇంకా భూమిమీద నూకలుండడం వలన, ఒక ఆలోచన కలిగింది. అప్పుడా దెయ్యంతో ఇలా అన్నాను.

'దెయ్యంగారూ! మా అమ్మా వాళ్ళకు ఈ విషయమంతా చెప్పి, నా వాటాకి వచ్చే భూమిలో కొంత అమ్మిఅయినా సరే, నేనే స్వయంగా మీ కథను అచ్చు వేయించి, పూర్వం కథ చదివిన పాఠకులందరికీ, ఈ కథ ఉచితంగా గానీ లేదా చదివినందుకు వాళ్ళకు ప్రజంటేషనుగా, దువ్వెన్నో కేలండరో ఇచ్చి, కథా, ఆ ప్రజంటేషను ప్రతీ పాఠకునికీ ముట్టినట్లు సంతకం చేయించుకొని మీకు చూపిస్తాను' అన్నాను.

అప్పుడా దెయ్యంగారు ఆకాశం చిల్లులు పడేలా అరుస్తూ "మెచ్చానురా నరుడా. ఇచ్చినమాట ఖచ్చితంగా నెరవేర్చాలిసోయ్"అంటూ, పాపం! చాలా కష్టపడి క్రిందకు వంగి, గుమ్మంగుండా గదిలోని నా మంచం మీదకు నన్ను విసిరేసి గాలిలో కలిసిపోయింది.

ఆ నొప్పులుతీరి మంచం మీదనుండి లేవడానికి నాకు రెండువారాలు పట్టింది. నేను మంచం పట్టానని తెలిసి మా పిన్ని పరామర్శకు వచ్చింది. అప్పుడామెను చూసి-

'పిన్నీ! పులిని చూసి నక్క వాత పెట్టుకొన్నదన్నట్లుగా నీ వలెనే నేనుకూడా ప్రఖ్యాత రచయిత నవుదామనుకొని ఏదో చేయబోయి మరేదో అయి చావుతప్పి కన్నులొట్టపోయి బయటపడ్డాను.' అని రాత్రి జరిగిందంతా చెప్పాను.

పిన్ని అమ్మతో, 'అక్కా బాబు జడుసుకున్నాడేమో' అంది. అప్పుడు నేను 'లేదుపిన్నీ, దెయ్యంగారు చెప్పినట్లు కథవ్రాసి ప్రచురించకుంటే నన్ను చాక్‌లెట్‌లా చప్పరించేస్తుందీ' అన్నాను వణికిపోతూ. ఆ దెయ్యం ఆకారం, ఊగడం అప్పుడు సర్కసులోని రాక్షసి చక్రంపై కూర్చొని గిరగిరా తిరిగి నట్లుండడం మున్నగునవన్నీ కళ్ళకు కట్టినట్లు మా పిన్నికి వివరించి చెప్పాను. అప్పుడామె ప్రశాంత వదనంతో చిరునవ్వు నవ్వుతూ నన్ను దగ్గరకు తీసుకొని ఇలా అంది.

'బాబూ! నీవు చెప్పిన విధంగానే చక్కని కథను వ్రాసి, రచయిత స్థానంలో నీ పేరుపెట్టి ప్రచురించబడేటట్లు చేస్తాను. నీవు నిశ్చింతగా నిర్భయంగా ఉండు నాన్నా' అని వెళ్ళిపోయింది.

ఆ తర్వాత కొంత కాలానికి మామూలు మనిషిని అయ్యాను. ఈలోగా మా పిన్ని ఒక చక్కని కథను కథానాయకిని ఆకాశానికి ఎత్తేస్తూ, ఒక నాయకుడిని దుర్మార్గునిగా దుష్టునిగా చిత్రించి, ఆ నవలను గూర్చి ఎంతో పొగుడుతూ తొలపలుకు యనే వ్రాసి ప్రచురింప జేసింది. ఆంధ్రావనిలోని ఆబాలగోపాలం ఆ కథను చదివి ఎంతో ఆనందించారు. ఆ నవలను అంకితం:- "శ్రీ శ్రీ దెయ్యంగార్కి" అని వ్రాసి మీరే ప్రచురింప జేయమని మా పిన్నికి చెప్పాను.

కొన్ని రోజులు గడచిన అనంతరం ఒకనాటి రాత్రి ఆదెయ్యం, నా మంచంపై నావద్ద కూర్చొని, నా జుట్టులో వ్రేళ్లుపెట్టి ఇలా చెప్పసాగింది. కానీ ఆమె మాటలకు అడ్డువచ్చి గబగబా స్పెషల్ లోని నా పేరుతో రచింపబడ్డ (మా పిన్ని వ్రాసిన నవల) తీసుకు వచ్చి ఆమెకు చూపించా. తరువాత మంచంపై ఆమె సరసనే కూర్చున్నా చిత్రం! అచ్చం మా పిన్ని అంతే ఉంది. ఆ రోజులీ, రాక్షసిలా లేదు. మా పిన్నిలా చిరునవ్వు నవ్వుతూ, 'ఫరవాలేదు పడుకో బాబూ' అని, ఆమె కూడా నా ప్రక్కనే పడుకొని నా వీపు నిమురుతూ......

"పిచ్చి తండ్రీ! చేతులున్న ప్రతివాళ్లూ కథలు వ్రాయగలిగి, కాళ్లున్న వారందరూ నాట్యమాడేవారై నోరున్న ప్రతివ్యక్తి పాడగలిగితే ఆ కథలు చదివి, నాట్యాలను చూచి, పాటలను విని ఆనందించేది ఎవరు? అట్టి కళాకారుల జీవితాలు మానవసేవకే అంకితం చేసుకోనీ, ఆ కళలలో సంపూర్ణ పరిజ్ఞానం లేని మన మందరం ఏమీ చేతకాని వాళ్ళమనీ, ఎందుకూ పనికరాని - వాళ్ళమనీ అనుకోకు. ఇటువంటి అర్థంలేని విషయాలతో నీ మనస్సును పాడుచేసుకోనేక నీ విద్యుక్త ధర్మ నిర్వహణలో మనస్సును లగ్నంచేసి, నీ అంతరాత్మ మెచ్చేటట్లుగా హృదయ పూర్వకంగా కృషి చేయి. దేముడు సంతోషిస్తాడు. ఇంతకు పూర్వం చెప్పినట్లు రచయితలు చేతులు పడిపోయేలా రాత్రి అనక పగలనక వ్రాస్తే మనం హాయిగా నిమిషాలలో చదివి ఆనందిస్తున్నాం. నటీనటులు అష్టకష్టాల నోర్చి నటిస్తే స్వల్ప ఖరీదు టిక్కట్టుతో హాయిగా చూచి ఆనందిస్తున్నాం. గాయకులు గొంతుకలు చించుకొని పాడితే శ్రవణానందకరంగా విని ఆనందిస్తున్నాం. ఒక విధంగా అట్టి కళాకారులకన్నా మనమే అదృష్టవంతులం..." అని తన ప్రసంగాన్ని ముగించి మాయమయ్యింది.

మరునాడుదయమే పిన్నికి రాత్రి దెయ్యం చెప్పిన సంగతులన్నీ పూసగ్రుచ్చినట్లు వివరించి చెప్పా, ఆమె నవ్వుతూ 'బలే స్నేహితురాలే దొరికింది నీకు' అంది నాటినుండీ నేటివరకూ కథలు వ్రాయాలనే యత్నం చేస్తే ఒట్టు!

★

